


పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. డోర్నకల్, బయ్యారం, గార్ల, మరిపెడ, నర్సింహులపేట మండలాల్లో ఓమోస్తారు వర్షం పడుతుంది. మహబూబాబాద్, కొత్తగూడ మండలాల్లో గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో చినుకులు ప్రారంభమయ్యాయి. కేసముద్రం, గూడూరు, దంతాలపల్లి మండలాల్లో గాలిదుమారంతో పాటు జల్లులుపడ్డాయి. ఆకాశంలో మబ్బులు చేసి ఉండడంతో భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

మునిసిపాలిటీలకు స్వచ్ఛ ర్యాంకులు



మహబూబాబాద్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలకు కేంద్రప్రభుత్వం గురువారం ర్యాంకింగ్‌లను కేటాయించింది. దేశ వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్వచ్ఛతపై వచ్చిన మార్కుల ఆధారంగా మునిసిపాలిటీలకు ర్యాంకింగ్‌లు కేటాయించి, వాటి ప్రకారం నిధులనుమంజూరు చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 141 మునిసిపాలిటీలుండగా, అందులో మహబూబాబాద్ మునిసిపాలిటీకి 62వ ర్యాంకు, మరిపెడకు 110, తొర్రూరుకు 112, డోర్నకల్ 115 ర్యాంకులు సాధించాయి. ఇక దేశ వ్యాప్తంగా పరిశీలిస్తే మానుకోటకు 387, మరిపెడకు 1232, తొర్రూరుకు 1237, డోర్నకల్‌కు 1307 ర్యాంకుల వచ్చినట్లు కేంద్రం తన నివేదికలో వెల్లడించింది.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మునిసిపల్ మాజీఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా సెంటర్‌లో ఇటీవల చిరువ్యాపారుల గుమ్మిలను మునిసిపల్ అధికారులు తొలగించారని, వారికి సమీకృత కూరగాయల మార్కెట్ ఆవరణలో స్థానం కల్పించాలని కోరారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, రవి, రవీందర్, కుమార్, కవిత, యాకూబ్ పాషా, శ్రీధర్, భద్రయ్య, సత్తెమ్మ, రహీం, ఎమ్డీ.రఫీ, హుస్సేన్, ఫైమద్, యూసూఫ్ పాల్గొన్నారు.



స్థానిక సమరానికి సై

- జిల్లాలో స్వల్ప మార్పులతో ఎంపీటీసీ, జడ్పీటీసీలు
- పోలింగ్ బాక్సులు, బ్యాలెట్ పేపర్‌లు సిద్ధం
- ఆర్వోలు, ఏఆర్వో నోడల్ ఆఫీసర్ల నియామకం

కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీ

మహబూబాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న.. స్థానిక సమరానికి కౌంట్.. డౌన్ ఆరంభమైంది. ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్రప్రభుత్వం అన్ని ఏర్పాట్లను దాదాపు పూర్తి చేసింది. మహబూబాబాద్ జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో), అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఏఆర్వో), నోడల్ ఆఫీసర్ ల నియామకాన్ని కూడా పూర్తి చేసింది. దీంతో ముందస్తుగానే అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సై అంటే సై అంటూ ఎన్నికల కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏడాదిన్నర కాలంలో దశలవారీగా ఒక్కొక్కటిగా అమలుపరుస్తూ ప్రచారస్త్రంగా మలుచుకుంటుంటే.. బీఆర్ఎస్ అధికార పక్ష హామీల వైఫల్యాలను ఏకరువు పెడుతూ.. స్థానిక సమరంలో పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు ఆరంభించింది.

నాటికి.. నేటికి.. స్వల్ప మార్పులతో...

గత ఎన్నికల సమయంలో 196 ఎంపీటీసీలు, 16 జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించగా.. పరిపాలన సౌలభ్యం.. కొత్త మునిసిపాలిటీ, మండలాల ఏర్పాటుతో సంఖ్య చిత్రం మారిపోయింది. కేసముద్రం మునిసిపాలిటీగా ఆవిర్భవించడంతో ఆ పరిధిలోని మూడు ఎంపీటీసీ స్థానాలైన కేసముద్రం (విలేజ్-1), కేసముద్రం (విలేజ్-2), కేసముద్రం (స్టేషన్)లు కేసముద్రం మునిసిపాలిటీలోకి చేర్చడంతో పాటు కొన్ని గ్రామాల పరిధిని ఆయా ఎంపీటీసీల పరిధిలోకి మార్పు చేశారు. దీంతో జిల్లాలో

ఇటు కాంగ్రెస్.. అటు బీఆర్ఎస్..

స్థానిక సమరానికి ముందస్తుగానే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటాపోటీగా ప్రచారపర్వంలో క్షేత్రస్థాయి కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇటీవలనే కాంగ్రెస్ 'ప్రజాపాలన-ప్రగతిబాట' పేరిట జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్ మండలాల్లో రూ.400 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించేందుకు ఏకంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఐదుగురు అతిరథ మహారథ మంత్రులను హాజరయ్యేలా చేసి అందరి దృష్టిని ఆకర్షించేలా చేసింది. సాధారణ కార్యక్రమాల్లా కాకుండా భారీ బహిరంగ సభలతో బాణాసంచా పేల్చి జన సమీకరణతో కాంగ్రెస్ క్షేత్రస్థాయి బలాన్ని చాటిచెప్పింది. వెనుక ఆద్యంతం అన్ని తానే అయి నడిపిన సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి స్థానిక సమరానికి ఈ సభలతోనే శంఖారావం పూరించినట్లు పార్టీ శ్రేణులు ప్రచారంలో పెట్టాయి. ఇక దశాబ్దకాలం అధికారంలో ఉండి గత ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ దాదాపు ఏడాది కాలానికి పైగా స్తబ్దంగా కనిపించినప్పటికి స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సత్తా చాటాలని మండలాల సభల ద్వారా ఉవ్విలూరుతోంది. వాస్తవానికి ఈ పార్టీలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు ఉన్నప్పటికి తాజాగా నిర్వహించిన సభల్లో సమిష్టిగానే వేదికపై కన్పిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపుతున్నారు.

సీపీఐ తనదైన శైలీలో స్థానిక సంస్థల్లో ఓటు బ్యాంక్‌కు అనుగుణంగా ఆయా స్థానాలను దక్కించుకునేందుకు గత కొద్దికాలంగా వివిధ సభల ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. సీపీఎం పార్టీ సైతం ఇదే బాటలో పయనిస్తోంది. బీజేపీ, సీపీఐ (ఎంఎల్) పార్టీలు కూడా తమకు బలం ఉన్నచోట ప్రాతినిధ్యంలోకి వచ్చేందుకు సకలశక్తులు ఒడ్డుతున్నాయి.

(మిగతా 8వ పేజీలో...)

గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూలై17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టడీ అవర్‌లో ఉన్న విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన ఎలా జరుగుతుందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని పరిసరాలు, డైనింగ్‌హాల్, స్టడీ రూమ్, మరుగుదొడ్లను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని, వసతి గృహంలో పరిశుభ్రతను పాటిస్తూ, నిత్యం శానిటేషన్ చేయాలన్నారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వైద్యపరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

ఫౌంటెన్‌ను మరో చోటకు మార్చాలి

- బీజేపీ పట్టణాధ్యక్షుడు అజయ్



మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

మహబూబాబాద్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ సెంటర్ వద్ద నిర్మించే ఫౌంటెన్‌ను జిల్లా కేంద్రంలోని మరోచోటకు మార్చాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు వెన్నమల్ల అజయ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ కోరారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయాన్ని గురువారం ముట్టడించి, కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముత్యాలమ్మ గుడికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే మరో చోటకు మార్చాలని చెప్పారు. అక్కడ ఫౌంటెన్ నిర్మిస్తే ఆ పనులను అడ్డుకుని తీరుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు గడ్డం అశోక్, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, దార ఇందుభారతి, రవినాయక్, పద్మ, రవియాదవ్, నరేష్‌నాయక్, శంకర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఆరోగ్య కేంద్రంగా కోమట్లగూడెం

మహబూబాబాద్ క్రైం, జూలై17 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన కాయకల్ప్ అవార్డుల్లో జిల్లాలోని కోమట్లగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపికైనట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రవిరాథోడ్ తెలిపారు. మానుకోటలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య కేంద్రాల్లో పరిశుభ్రత, అంటువ్యాధుల నియంత్రణకు ప్రోత్సహించడానికి అందించే అవార్డుల్లో భాగంగా బెస్టు కేంద్రంగా ఎంపికైన కోమట్లగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.2లక్షల నగదు బహుమతి గెలుపొందిందన్నారు. మరిపెడ, కురవి, కొత్తగూడ, కేసముద్రం, ఇనుగుర్తి, దంతాలపల్లి, మల్యాల, నెల్లికుదురు, బలపాల ఆరోగ్య సంస్థలు మరోసారి ఉత్తమ ప్రతిభ కనబర్చి పోత్సాహక బహుమతులు గెలుపొందడం అభినందనీయమన్నారు. ఆయూష్మాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పర్వతగిరి ఆరోగ్య మందిర్ ఎంపిక కాగా, బయ్యారం, పెద్దముప్పారం రన్నర్ అప్ నిలిచినట్లు తెలిపారు. సమిష్టి కృషి, పరిశుభ్రత నిబద్ధత, నాణ్యమైన ఆరోగ్యం సంరక్షణతో పని చేస్తే భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించవచ్చున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ



కంబాలపల్లి పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీలిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ.. వైద్యులు, సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ సూచించారు. కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు జిల్లాపరిషత్ హైస్కూల్, గ్రామపంచాయతీ కార్యాలయాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌సెంటర్ల వారీగా ప్రజల యొక్క ఆరోగ్య స్థితిగతులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. గ్రామపంచాయతీలో ఇంటి పన్నులు వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీవో రఘుపతిరెడ్డి, ఉపాధ్యాయులు ఉప్పలయ్య పాల్గొన్నారు.

నలుగురికి 14 రోజుల రిమాండ్

మరిపెడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కోర్టు వాయిదాలకు గైర్హాజరైన నలుగురుకి తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి డి.ధీరజ్‌కుమార్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపారు. గురువారం ఎస్సై స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేర్వేరు కేసుల్లోని ముద్దాయిలు బోర మల్లయ్య, రేఖ సునీత, గుగులోత్ విజయ, గుగులోత్ వీరన్నలు కోర్టు వాయిదాలకు గైర్హాజరవుతున్నారు. వీరికి నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో వారిని జడ్జి ఎదుట హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలి
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



జిల్లా ఆస్పత్రిలో వైద్యులతో సమావేశమైన ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలందించాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రిని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. సాధారణ, ఐసీయూ వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. అనంతరం వైద్యాధికారులతో సమావేశమై ఆస్పత్రికి కావాల్సిన వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కార్ ఆస్పత్రికి ఎక్కువగా పేద వాళ్ల వస్తారని, వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని చెప్పారు. హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల తరహాలో తెలంగాణలో మొట్టమొదటగా జిల్లా ఆస్పత్రిలో పాయిజన్ కేసులకు ప్రత్యేక వసతులతో మెరుగైన వైద్య సేవలందిచేందుకు కృషి చేద్దామన్నారు. స్పెషల్ వార్డును ఏర్పాటు చేసి అందులో ప్రత్యేకంగా డయాలసిస్ బెడ్‌ను ఏర్పాటు చేసి పాయిజన్ కేసులకు వెంటనే డయాలసిస్ చేస్తే ఎక్కువమందిని బతికించుకునే అవకాశం ఉంటుందన్నారు. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మెడికల్ కళాశాలను ప్రారంభించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్‌నాయక్, ఆర్ఎంవో జగదీష్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

డాక్టర్‌గా రోగులకు వైద్య సేవలు..

జిల్లా ఆస్పత్రి సందర్శనలో ఎమ్మెల్యే మురళీనాయక్ డాక్టర్‌గా మారి రోగులకు వైద్య సేవలందించారు. స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ స్వయాన డాక్టర్ కావడంతో మెడలో స్టెతస్కోప్ వేసుకుని ఐసీయూలో రోగుల బెడ్ వద్దకు వెళ్లి ఒక్కొక్కరిని పరీక్షించి వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరీక్షించారు. ఎమ్మెల్యే మురళీనాయక్ స్వయాన రోగులకు వైద్యం చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.



రోగులను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

27న మానుకోట నుంచి బాపట్లకు

టూర్ ప్యాకేజీ బస్సు

ఆర్టీసీ డిపో మేనేజర్ శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీలో భాగంగా ఈ నెల 27 మహబూబాబాద్ నుంచి బాపట్లకు డీలక్స్ బస్సు వెళ్లనున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారు జామున 4 గంటలకు మానుకోట డిపో నుంచి బయలు దేరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పెనుగంచిప్రోలు, విజయవాడ మీదుగా బాపట్లబీచ్‌కు చేరుకుంటుందని చెప్పారు. తిరిగి అక్కడి నుంచి బయలు దేరి రాత్రి 11 గంటలకు మానుకోటకు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు ఒక్కొక్కరికి రూ.1000, పిల్లలకు ఒక్కొక్కరికి రూ.500 చార్జీ నిర్ణయించడం జరిగిందన్నారు. టిక్కెట్ బుకింగ్ కోసం ఎమ్డీ. నబీ సెల్ : 99482 14022కు ఫోన్ పే లేదా నేరుగా డబ్బులు చెల్లించి సీటు బుక్ చేసుకోవాలని కోరారు. ఈ సదవకాశాన్ని మహబూబాబాద్ పరిసర ప్రాంతప్రజలు వినియోగించుకుని పుణ్యక్షేత్రాలు, విహార ప్రదేశాలను సందర్శించాలని కోరారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

తొర్రూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై ఉపేందర్ అన్నారు. గురువారం తొర్రూరులోని వివిధ సెంటర్‌లలో సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ఇతర అనుమతి పత్రాల తనిఖీలు నిర్వహించి ఆయన మాట్లాడారు. వాహనదారులు తప్పనిసరిగా ఆర్‌సీ, ఇన్సూరెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు మైనర్‌లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దన్నారు. వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ లేకున్నా కేసులు నమోదు చేస్తామన్నారు. అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో సిబ్బంది ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు



బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యానాయక్

మరిపెడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపని మాజీ మంత్రి ధరంసోత్ రెడ్యానాయక్ అన్నారు. గురువారం మరిపెడ, చిన్నగూడూరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం స్థానిక మునిసిపల్ కేంద్రంలోని భార్గవ్ ఫంక్షన్ హాల్‌లో జరుగగా రెడ్యానాయక్ పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని విస్మరించారని గుర్తు చేశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తానని మోసం చేశాడన్నారు. పింఛన్లు పెంపు ఊసేలేదని విమర్శించారు. గ్యాస్ డబ్బులు రెండు మూడు నెలలు వేసి ఇప్పుడు వేస్తలేదన్నారు. సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలు ఇప్పటికే గుర్తించారని, స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు రెడీ అయ్యారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గడపగడపకు తిరిగి రేవంత్‌రెడ్డి మోసాలపై వివరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, యువనేత డీఎస్.రవిచంద్ర, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ కె.మహేందర్‌రెడ్డి, గాదె అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు అచ్యుత్‌రావు, తాళ్లపెల్లి శ్రీనివాస్, రఘు, రాంబాబు, రవీందర్‌నాయక్, వుప్పల నాగేశ్వర్‌రావు, పానుగోత్ వెంకన్న, రాంసింగ్, బంటు ఉప్పలయ్య, కృష్ణ, అజ్మీరా రెడ్డి, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలకు ప్రోత్సాహకాలు

తొర్రూరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పండ్లు, కూరగాయలు, ఉద్యానవన పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని రైతులు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. గురువారం తొర్రూరు మండలం మాటేడు, వెంకటాపురం, హరిపిరాల గ్రామాల్లో పర్యటించి రైతులు సాగుచేస్తున్న కూరగాయల సాగు, ఆయిల్‌పామ్ పంటలను పరిశీలించి సాగుపై పలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా టమాట, వంగ, క్యాబేజీ, కాలీఫ్లవర్ డిమాండ్ ఉన్న కూరగాయల నారు ఎకరాకు 8వేల మొక్కలకు ములుగు, సిద్దిపేట జిల్లాల్లో సబ్సిడీ ఇస్తున్నారన్నారు. తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత పందిరి నిర్మాణానికి రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం ద్వారా రూ.50వేలు రాయితీ కలిపిస్తుందని వెల్లడించారు. అయిల్‌పామ్ పంటల్లో అంతర పంటల కింద కూరగాయాలు సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.2100 చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తారని తెలిపారు. రైతులు పాత విధానాలకు స్వస్తిపలికి నూతన రకాల సాగు, ప్రోట్రేస్ల నారు పెంపకం, మల్చింగ్, బిందు సేద్యం, ఫలదీకరణ సాగుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జిల్లా అధికారి రాములు, ఏఈవో జమున, రైతులు సర్వేశ్వర్‌రావు, యాకయ్య, బిందు సేద్య ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాటేడులో రైతులతో మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి మరియన్న



ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఎమ్మెల్యేకు నారాయణపురం రైతుల వినతి

కేసముద్రం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలివ్వాలని కోరుతూ మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే మురళీనాయక్‌కు గురువారం ఆ గ్రామ మాజీ సర్పంచ్ పి.లక్ష్మీపతి ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ గ్రామంలో ఎనిమిదేళ్లుగా 600 మంది రైతులకు పట్టాదారుపాస్‌పుస్తకాలు లేకపోవడంతో సుమారు రూ.15కోట్ల విలువైన పథకాలను నష్టపోయారని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ చూపి తమకు పట్టాపాస్‌పుస్తకాలిప్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అన్నారపు యాకయ్య, వై.రవీందర్, బి.వెంకట్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నరేష్, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

22న రామప్పలో వేలం

వెంకటాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముకునేందుకు ఈనెల 22న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బిల్ల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయం ఆవరణలో ఏడాది పాటు కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముకునేందుకు పాటదారులు రూ.లక్షా 50 వేల ధరావత్ సొమ్ము చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక

ములుగు కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని లబ్ధిదారులు ఉచిత ఇసుక కోసం సంబంధిత పంచాయతీ సెక్రటరీ ద్వారా ఎంపీడీవో కార్యాలయంలో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఒక ఇంటి నిర్మాణం కోసం 25క్యూబిక్ మీటర్ల ఇసుకను ఉచితంగా పొందొచ్చని తెలిపారు.

ఇసుక తోలకాలకు సంబంధించి కొంతమంది ట్రాక్టర్ల యజమానులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారి ద్వారా లేదా సొంత ట్రాక్టర్ ద్వారా ఇసుక తోలకాలు జరపాల్సి ఉంటుందని వివరించారు. ఇతర వ్యక్తుల ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తే వాహనాన్ని సీజ్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్టు

● ఐదు కేజీలు స్వాధీనం, ముగ్గురిపై కేసు నమోదు



బయ్యారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్

బయ్యారం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా చేస్తున్న ముఠా సభ్యులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. బయ్యారం పోలీస్ స్టేషన్‌లో సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. ఎస్సై తిరుపతి నేతృత్వంలో పోలీస్ సిబ్బంది గురువారం గంధంపల్లి బస్టాండ్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఇరువురు వ్యక్తులు లగేజ్‌బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తారసపడ్డారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, వారిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. బ్యాగులో ఏమున్నదని ప్రశ్నించగా, గంజాయి ప్యాకెట్లు ఉన్నాయని చెప్పడంతో బ్యాగ్ తెరవగా 5 గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు వెల్లడించారు. గంజాయి ప్యాకెట్లను తూకం వేయగా 5.385 కేజీలు ఉన్నట్లు సీఐ తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ. 2.69 లక్షలు ఉంటుందన్నారు. దీంతో గంజాయి రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి గంజాయి ప్యాకెట్లతో పాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు.

సోలార్ కాంతులు ఏవీ..?!

● ముందుకు సాగని పీఎం కుసుమ్ పథకం ● క్షేత్రస్థాయిలో అమలు కాని మహాయోజన
● భూములిచ్చేందుకు ముందుకొచ్చిన రైతులు ● అయినా పట్టాలెక్కని పనులు



మహబూబాబాద్ జిల్లాలో
సోలార్ పవర్ ప్లాంట్ల కోసం సేకరించిన భూమి

ఏటూరునాగారం రూరల్, జూలై16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎన్ని ప్రవేశపెట్టినా క్షేత్రస్థాయిలో అవి అమలుకు నోచుకోవడం లేదు. ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఇవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) పథకమే దీనికి నిదర్శనం. మొదట్లో ఆరంభ శూరత్వం అన్నట్లు వ్యవహరించిన అధికార యంత్రాంగం ఆ తర్వాత తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. గిరిజన మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన సాధనే ఈ పథకం ముఖ్యోద్దేశం. గిరిజన రైతుల పొలాలను లీజుకు తీసుకొని వాటిలో సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలు చేపడతారు. ఐదు నెలల క్రితం హడావుడి చేసిన అధికార యంత్రాంగం ఆ పనులను అటకెక్కించారు. తొలుత పీఎం కుసుమ్ పథకానికి భూములిచ్చేందుకు రైతులు అనాసక్తి ప్రదర్శించారు. కానీ ఈ పథకంపై ఐటీడీఏ పరిధి మండలాల్లో అధికారులు విస్తృ ప్రచారం నిర్వహించి రైతుల్లోని అపోహలను తొలగించారు. ఈ పథకం వల్ల చేకూరే లబ్ధిని గిరిజన రైతులకు సావధానంగా వివరించారు. దీంతో ఈ పథకం అమలుకు భూమిలిచ్చేందుకు రైతులు ముందుకొచ్చి లీజుకు అంగీకారం తెలిపారు. అయితే.. రైతులను చైతన్య పరిచిన అధికార యంత్రాంగమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కొన్ని కారణాలు చూపెడుతూ ఈ పథకానికి మొండి చేయి చూపినట్లు తెలుస్తోంది.

సువర్ణవకాశం ఉన్నా..

గిరిజన మహిళల ఆర్థిక తోడ్పాటుకు పీఎం కుసుమ్ పథకం ఓ సువర్ణవకాశం. పట్టాలు కలిగిన గిరిజన భూములను లీజుకు తీసుకొని వాటిలో సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణం చేపడతారు. ఆ ప్లాంట్లను గిరిజన మహిళ సంఘాల సభ్యులకు అప్పగించి నిర్వహణ బాధ్యతలు పూర్తిగా వారి చేతుల్లోనే పెడుతారు. ఈ పథకం ద్వారా భూములిచ్చే రైతులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. నాలుగెకరాల ఆర్వోఎఫ్ఆర్ లేదా రెవెన్యూ పట్టాలు కలిగి విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో గల రైతుల భూములను 25 ఏళ్ల వరకు ప్రభుత్వం లీజుకు తీసుకొంటుంది. ఆ భూములకు ఎకరానికి ప్రతి సంవత్సరం రూ. 12,500 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. అంతేకాకుండా లీజుకిచ్చిన రైతుల భూముల్లో ఏర్పాటు చేసే సోలార్ పవర్ ప్లాంట్ల లాభాల్లో కూడా ఆ రైతులకు వాటా చెల్లించనుంది. గిరిజన మహిళలు, రైతులకు ఎంతో మేలు జరిగేలా ఉన్న ఈ పథకాన్ని గాలికొదిలేయడం పట్ల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ తప్ప పనులెక్కడ?

పీఎం కుసుమ్ పథకం గిరిజన రైతులు, మహిళలకు వరం లాంటింది. ఐటీడీఏ పరిధిలో గల ఆసక్తి గల గిరిజన రైతుల వద్ద నుంచి సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతుల వద్ద నుంచి భూముల లీజుకు దరఖాస్తుల స్వీకరణను ఐటీడీఏ ఈ ఏడాది ఫిబ్రవరిలో చేపట్టింది. రైతులు తమ పొలాల్లో సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి ఆసక్తిని కనబరుస్తూ తమ భూములను లీజుకిచ్చేందుకు ముందుకొచ్చారు. భూములు లీజుకు తీసుకొనేందుకు అప్పట్లో గిరిజన గ్రామాల్లో పీఎం కుసుమ్ పథకంపై పెసా కో ఆర్డినేటర్లు, మొబిలైజర్లు గిరిజన రైతులకు అవగాహన కల్పించి రైతుల్లోని సందేహాలను సైతం నివృత్తి చేసి రైతులు భూమిలిచ్చేందుకు ముందుకొచ్చారు. ఇప్పటి వరకు 172 ఎకరాల మేర భూమిలిచ్చేందుకు మొగ్గు చూపారు. ములుగు జిల్లాలో 72 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 40 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 30 ఎకరాలను రైతులు లీజుకు ఇచ్చేందుకు రైతులు ఆసక్తిని కనబర్చి దరఖాస్తులు కూడా ఐటీడీఏకు అందించారు. అంతేకాకుండా 2009లో వన సంరక్షణ సమితి పేరుతో గ్రామ ఉమ్మడి హక్కు ప్రకారం మహబూబాబాద్ డివిజన్ రేంజ్‌లో 1125 ఎకరాలు, ఏటూరునాగారం రేంజ్ పరిధిలో 13,357 ఎకరాలను అధికారులు గుర్తించారు. అదేవిధంగా రెవెన్యూ పరిధిలోని గంగారం 30 ఎకరాలు, కన్నాయిగూడెం, వెంకటాపురం మండలాల పరిధిలో రెవెన్యూ భూముల్లో కూడా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు చేసేందుకు భూ పరిశీలనను చేశారు.

ముందుకు సాగని పనులు

కేంద్రం అందిస్తున్న అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం జారవిడినట్లే కనబరుస్తోంది. పీఎం కుసుమ్ పథకం వల్ల ఎంతో మేలు జరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నప్పటికిని ఎందుకనో ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేయడం లేదు. పథకం వల్ల గిరిజన మహిళలు, రైతులు ఆర్థికంగా ఎదిగే అవకాశాలు మెండుగా ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం లేదు. రైతులు లీజుకిచ్చేందుకు సిద్ధంగా ఉండి ఇప్పటికే కొంత మంది రైతులు దరఖాస్తులు కూడా సమర్పించనప్పటికీ ఈ పథకంపై కొన్ని నెలలుగా ఊసే లేకుండాపోయింది. పీఎం కుసుమ్ పథకం పనులు ఒక్క అడుగు కూడా ఇప్పటి వరకు ముందుకు పడలేదు.

యూరియా కోసం తప్పని తిప్పలు

పీఏసీఎస్ గోడౌన్ వద్ద క్యూ కట్టిన రైతులు



యూరియా బస్తాల కోసం లైన్‌లో ఉన్న రైతులు

కాటారం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా బస్తాల కోసం తిప్పలు తప్పడం లేదు. యూరియా డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో రైతులు షాపుల చుట్టూ తిరుగుతున్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం(పీఏసీఎస్) గోడౌన్ వద్ద గురువారం యూరియా బస్తాల కోసం రైతులు క్యూ కట్టారు. వర్షం కురిసి వెలియడంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు గోడౌన్ వద్ద గుమికూడారు. గోడౌన్‌కు బుధవారం రాత్రి 520 యూరియా బస్తాలు రాగా పలు గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌లతో బారులు తీరారు. ప్రైవేట్ వ్యాపారులు యూరియాను ఇతర ఎరువులతో లింక్ పెట్టడం, బస్తాను రూ.330కు విక్రయించడంతో అన్నదాతలు పీఏసీఎస్‌కు తరలివస్తున్నారు. ప్రైవేట్‌కన్నా ధర తక్కువగా ఉండటం, యూరియా బస్తాలకు కొరత ఉండొచ్చనే వదంతులతో రైతులు యూరియా బస్తాలను తీసుకెళ్లి నిల్వ చేసుకోవడానికి గోడౌన్ ముందు కనిపిస్తున్నారు. అయితే.. రైతులకు మూడు బస్తాల చొప్పునే ఇస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో మరిన్ని ఎరువుల బస్తాలు రానున్నాయని, ఎరువులు కావాల్సిన రైతులు వ్యవసాయాధికారులను పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డులతో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

దోపిడీకి పాల్పడుతున్న యువకులు

● ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు



కొత్తగూడలో నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ సూర్యప్రకాష్

కొత్తగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మత్తులో యువకులు అడ్డదారులు తొక్కుతూ దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. కేసముద్రం మండలానికి చెందిన యువకున్ని బెదిరించి దోచుకున్న ముగ్గురు యువకులు.. నిందితుల్లో ఇద్దరు యువకులపై హన్మకొండలో పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు నమోదు అయినట్టు గూడూరు సీఐ సూర్యప్రకాష్ పేర్కొన్నారు. కొత్తగూడ పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గూడూర్ సీఐ సూర్యప్రకాష్ చూపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కేసముద్రం మండలం మర్రితండాకు చెందిన వాంకుడోత్ సునిల్ కొత్తగూడలో ఇంటర్ విద్యను పూర్తి చేశాడు. సునిల్ సర్టిఫికెట్‌ల కోసం ఈనెల 14న కొత్తగూడకు వచ్చి తిరిగి వెళుతుండగా ముగ్గురు యువకులు సునిల్‌ను బెదిరించి ద్విచక్రవాహనంపై పెగడపల్లి గ్రామం సమీపంలోకి తీసుకెళ్లారు.

సునిల్ నుంచి బ్యాగు, మొబైల్ ఫోన్, డబ్బులు తీసుకుని బెదిరిస్తుండగా అటుగా వచ్చిన గొర్లకాపరిని చూసి పారిపోయారు. ఈనెల 15న సునిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుల కోసం గాలించారు. గురువారం మండలంలోని పొగుళ్లపల్లి చర్చి వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో కొత్తగూడ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన మడిపెద్ది వినయ్, వరంగల్ జిల్లా చంద్రయ్యపల్లికి చెందిన బోగి రఘు, బానోజిపేటకు చెందిన పెరుమండ్ల బాలాజీ ఉన్నారు. వారి నుంచి మొబైల్‌ఫోన్, సిమ్, రూ.100 స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. కాగా, అరెస్ట్ అయిన వారిలో ఇద్దరిపై ఇటీవల హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసులో అరెస్టయినట్టు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ కుశకుమార్ పాల్గొన్నారు.

టేకు చెట్ల నరికివేత

● న్యాయం చేయాలని

గిరిజన రైతు దంపతుల వేడుకోలు

నల్లబెల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తమ వ్యవసాయ భూమిలోని ఒడ్డు వెంట ఉన్న 100టేకు చెట్లను అన్యాయంగా, ఆక్రోశంతో కొందరు వ్యక్తులు నరికివేశారని బాధిత గిరిజన రైతు బానోతు దస్రు దంపతులు గురువారం తెలియజేశారు. బాధితుడు బానోతు దస్రు దంపతుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని గోవిందపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రచెరువు తండా సమీపంలో బానోతు దస్రుకు ఉన్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిలో 20 సంవత్సరాల కిందట జాతీయ ఉపాధి హామి పథకం ద్వారా మంజూరైన 100 టేకు చెట్ల మొక్కలను ఒడ్డు వెంట నాటుకున్నాడు. ఈ టేకు చెట్లు లాభసాటి ఆదాయం వచ్చే విధంగా పెరిగాయి. అయితే దస్రు అనారోగ్యంతో దవాఖానలో ఉన్నది చూసిన ఎర్రచెరువుతండాకు చెందిన కొందరు వ్యక్తులు ఈ నెల 3వ తేదీన 100 టేకు చెట్లను గొడ్డలితో నరికివేశారు.

ఈ నెల 4వ తేదిన దస్రు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లగా రూ.6లక్షల విలువ గల మొత్తం టేకు చెట్లు నరికివేసి ఉన్నాయి. దీంతో ఈ నెల 5వ తేదిన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు టేకు చెట్లను నరికిన ఘటన స్థలి వద్దకు వచ్చి చూశారు. కానీ, నేటి వరకు ఏలాంటి న్యాయం జరగలేదని బాధిత గిరిజన రైతు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

దేవరుప్పుల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కన్న కూతురిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రి కొంత కాలంగా కూతురు పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కామాంధుడు కటకటాల పాలయ్యాడు. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తన కన్నకూతురుతో అసభ్యంగా ప్రవర్తించాడు.ఈ నేపథ్యంలో బాలిక పెద్దమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. గురువారం అరెస్ట్ చేసి జనగామ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.



తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న కానిస్టేబుల్

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ దుండిగల్ ప్రాంతానికి చెందిన గణేష్ అనే ఎనిమిదేళ్ల బాలుడు తప్పిపోయి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నెమలిగొండకు రాగా పోలీసులు బాలుడిని తీసుకెళ్లి తల్లిందండ్రులకు అప్పగించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ వేణు కథనం ప్రకారం దుండిగల్‌కు చెందిన గణేష్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు 16న ఉదయం కాజీపేట వైపు వస్తున్న రైలులో వచ్చి ఘన్‌పూర్‌లో దిగాడు. ఘన్‌పూర్‌లో నెమలిగొండ గ్రామం వైపు వెళ్తున్న బైక్‌ను లిఫ్టు అడుకొని వెళ్లి అక్కడ దిగాడు. సమీపంలోని చెరువులో ఈతకొట్టి అక్కడి నుంచి గ్రామంలోకి వెళ్లాడు. గ్రామస్థులు బాలుడిని అడ్రను అడుగగా చెప్పకపోవడంతో గ్రామస్థులు 100కి ఫోన్ చేయగా పోలీస్ సిబ్బంది అక్కడి వెళ్లి బాలుడిని స్టేషన్‌కు తీసుకువచ్చారు.

మొబైల్ ఫోన్‌లో బాలుడు చూపించిన లోకేషన్ ఆధారంగా దుండిగల్ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలోని 5వ బ్లాక్‌లో ఉంటున్నట్టు గుర్తించారు. అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, బాలుడి అడ్రను కనుగొని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో కానిస్టేబుల్ సాయి చరణ్‌తో బాలుడిని పంపించి తల్లిదండ్రులకు అప్పగించారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

కురవి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండలం చింతపల్లి శివారు కుమ్మరిబోడు తండాకు చెందిన బానోత్ కమ్లీ (70) గురువారం ఉదయం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. కమ్లీ గత కొంతకాలంగా గుడుంబాకు అలవాటుపడి బానిసగా మారింది. ఈ క్రమంలో ఉదయం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకుంది. కమ్లీ భర్త గతంలోనే మృతి చెందాడు.

వేర్వేరు హత్యాయత్నం కేసుల్లో ఆరుగురి అరెస్టు

హసన్‌పర్తి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు హత్యాయత్నం కేసుల్లో ప్రమేయం ఉన్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఏసీపీ పి.నర్సింహరాము లు తెలిపారు. గురువారం కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పి.నర్సింహరావు వివరాలను వెల్లడించారు. కేయూ పోలీస్‌స్టేషన్ పరిధి ఎర్రగట్టు గుట్ట జీబీ మయూరి వైన్స్ పక్కన రెండు రోజుల క్రితం జరిగిన గొడవలో ముచ్చర్ల గ్రామానికి చెందిన చిర్ర నరేష్, చిర్ర రాము, చిర్ర సుమన్, పరికిరాల కార్తీక్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు. అలాగే సంవత్సరం క్రితం ముచ్చర్ల గ్రామంలో ఒక వ్యక్తి అంత్యక్రియల కార్యక్రమంలో చిర్ర నరేష్‌తో మట్టెడ సంతోష్ అలియాస్ చంటి, మరికొంత మంది వ్యక్తులు గొడవ పడి కొట్టి బెదిరించగా చిర్ర నరేష్ వారిపై ఫిర్యాదు చేయగా హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి మట్టెడ సంతోష్, చిర్ర నరేష్‌కు గొడవలు జరుగుతున్నాయి.

ఈనెల 13వ తేదీన మధ్యాహ్నం సమయంలో మట్టెడ సంతోష్, ల్యాదెల్ల శ్రీకాంత్, మట్టెడ కర్ణాకర్‌లు మయూరి వైన్స్ పక్కన ఆటో ఆపి మాట్లాడుకుంటుండగా అదే సమయంలో చిర్ర నరేష్, చిర్ర రాము, చిర్ర సుమన్, పరికిరాల కార్తీక్‌లు వన భోజనాలకు వెళ్లి మద్యం కోసం మయూరి వైన్స్ వద్దకు వచ్చారు. ఈ క్రమంలోనే ఆటోలో ఉన్న మట్టెడ సంతోష్, చిర్ర నరేష్‌ను కోర్టు కేసు రాజీ కావాలని కోరారు. దీంతో చిర్ర నరేష్, మట్టెడ సంతోష్‌ను కులం పేరుతో దూషిస్తూ నేను రాజీపడనని చెప్పి గొడవకు దిగాడు.

అక్కడే ఉన్న మట్టెడ సంతోష్‌ను కొడుతుండగా అడ్డువెళ్లిన ల్యాదెల్ల శ్రీకాంత్, మట్టెడ కరుణాకర్‌లను కొట్టి దాడి చేశా రు. మట్టెడ సంతోష్ తలపై బండరాళ్లతో కొట్టగా ప్రాణాపాయ స్థితిలో ఎంజీఎంలో చికిత్స పొందుతున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ గొడవలో చిర్ర నరేష్‌ను మట్టెడ సంతోష్, ల్యాదెల్ల శ్రీకాంత్, మట్టెడ కరుణాకర్‌లు కొట్టగా తల పగిలింది. ఈ విషయంలో తగాదా పడిన రెండు వర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ పి.నర్సింహరావు వెల్లడించారు. ఈ గొడవలో చిర్ర నరేష్, చిర్ర రాము, చిర్ర సుమన్, పరికిరాల కార్తీక్, ల్యాదెల్ల శ్రీకాంత్, మట్టెడ కరుణాకర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పి.నర్సింహరావు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ఆనందం

బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి

కొత్తగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో, మంత్రి సీతక్క చొరవతో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని కొత్తగూడ బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కర్ర జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కోనాపురంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొల్లం అయిలయ్య ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగూడ, గంగారం మండలాల్లో పేద ప్రజల ఇళ్ల నిర్మాణం కళను మంత్రి సీతక్క సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండు మండలాలకు అత్యధికంగా ఇళ్లు మంజూరు చేయించేందుకు సీతక్క కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంజ భిక్షపతి, నాయకులు పెద్దిరెడ్డి సుభాష్‌రెడ్డి, కడారి భాస్కర్‌రెడ్డి, బొల్లం శ్రీధర్, బొల్లం శ్రీకాంత్, సంజీవరెడ్డి, బొల్లం ఉపేందర్, రాజిరెడ్డి, ఆలూరి శ్రీను పాల్గొన్నారు.



కోనాపురంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంలో లబ్ధిదారులు, నాయకులు

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2456	1521
పల్లికాయ (సూక)	7000	3450
పల్లికాయ (పచ్చిది)	3950	1575
కందులు	5782	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7750	5300
పసుపు (కాడి)	11209	9534
పసుపు (గోల)	10309	9700
తేజ మిర్చి	10000	8500
తేజ ఏసీ	13200	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	14500	11500
యూఎస్341ఏసీ	12000	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఆంధ్రజ్యోతి
7
నవ్య
నివేదన
శుక్రవారం • 18 జూలై 2025

చింతన

అంతటా ఆయనే!

ఏ సుఖశాంతుల కోసం అన్వేషిస్తున్నామో అవి తమలోనే ఉన్నాయనే విషయం చాలామందికి తరచుగా అర్థం కాదు. శాంతిని పొందాలంటే ప్రత్యేకంగా ఏదో చెయ్యాలనుకుంటారు. అందువల్లనే నా దగ్గరకు వచ్చేవారిలో చాలామంది "మమ్మల్ని ఆశీర్వదించండి" అని అడుగుతూ ఉంటారు. కానీ సమస్త సృష్టిని రచించిన ఆ దివ్యశక్తి హస్తం తమపై ఉందని వారు గుర్తించడం లేదు. నక్షత్రాలను, సూర్య చంద్రులను, ఈ భూమిని సృష్టించినవాడి ఆశీర్వాదం అందరి వెంటా ఉంది. మీలోనికి శ్వాస వస్తూ, పోతున్నంతకాలం ఆయన చెయ్యి మీ తలపై ఉన్నట్టే! కాబట్టి ఏ ఇతర ఆశీర్వాదం మీకు అవసరం లేదు. అన్నీ మీ సమక్షంలోనే ఉన్నాయి. కానీ మీ లోపలి నేత్రాలను తెరిచినప్పుడు మాత్రమే సత్యమేమిటో మీకు గోచరిస్తుంది. ఏదో చేయడం వల్ల శాంతి చేకూరదు. చాలామందికి ఈ విషయంలో ఎన్నో అపోహలు ఉంటాయి. ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది బయట ఎక్కడో లేదనీ, మీలోనే ఉందనే విషయాన్ని హృదయంతో మీరు గ్రహించలేనప్పుడు... మీకు అన్నీ ఉన్నప్పటికీ ఏదీ సాధించలేరు.

తప్పు అక్కడే ఉంది...

నేను మీకొక చిన్న కథ చెబుతాను. పూర్వం ఒక వ్యక్తి ఒక కొండమీద చిన్న పూరి గుడిసెలో ఉండేవాడు. పొద్దున్నే పక్షుల కిలకిలరావాలను విని నిద్రలేచి, తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఒక రోజు అతను లేచేసరికి ఏదీ కనిపించడం లేదు. 'సూర్యుడు ఇంకా ఉదయించడం లేదు' అనుకున్నాడు. అంతా చీకటిగా ఉందని అగ్గిపుల్ల వెలిగించాడు. కానీ ఆ వెలుగు కూడా కనిపించలేదు. బయటకు వెళ్ళాక ఎండ తగిలింది, కానీ సూర్యుడు కనిపించ లేదు. 'ఈ రోజు సూర్యుడు ఎందుకో వెలుగు ఇవ్వడం లేదు' అనుకున్నాడు. ఇంతలో ఒక సాధువు అటువైపు వెళ్తూ... ఇతన్ని పలకరించాడు. ఆయనకు తన సమస్యను ఈ వ్యక్తి చెప్పుకున్నాడు. "సూర్యుడి వెలుగు లేకపోవడం కాదు, నీ కళ్ళలో ఏదో లోపం ఉంది" అన్నాడు ఆ సాధువు. అప్పుడు తప్పు ఎక్కడ ఉందో ఆ వ్యక్తికి తెలిసింది. అతనికి కళ్ళు సరిగ్గా కనిపించకపోవడం వల్లనే సూర్యుడి వెలుగు కనిపించ లేదు. అంతా చీకటిగా అనిపించింది.



ఆ సంగతి మరువకండి...

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో భగవంతుడితో "నువ్వంటూ ఉంటే నా ముందుకు రా!" అని సవాలు చేసే ఉంటారు. కానీ కష్టనష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే మనం భగవంతుడివైపు చూస్తాం. అంతకుముందు మన దైనందిన కార్యకలాపాలలో లీనమై ఉంటాం. ఈ ప్రపంచంలో భగవంతుడు లేని చోటంటూ ఏదైనా ఉందేమో చెప్పగలరా? ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. మీరు అంతర్ముఖంగా చూస్తే... అక్కడ మీకు ఆయన కనిపిస్తాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు... ఆయన సదా మనతోనే ఉన్నప్పటికీ ఆయనను మనం ఎప్పుడూ చూడలేదని, అందుకే ఈ ప్రాపంచిక జంజాటాలనే భారాన్ని మోస్తున్నామని మనకు బోధపడుతుంది. ఆయనను గుర్తించలేకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మనం ఉత్త చేతులతోనే మిగిలిపోతాం. ఈ ప్రపంచంలో 'జీవితం' అనే పువ్వు నుంచి మకరందాన్ని సేకరించే మార్గాన్ని మనం తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఇలాగే ఉండిపోయి ఆకలితో అలమటిస్తాం. మీ జీవితంలో ఏది జరిగినప్పటికీ... మీరు ఎంతో సౌభాగ్యశీలులు అనే విషయం మాత్రం ఎన్నటికీ మరువకండి.



ప్రేమ్‌రావత్
9246275220



ఆలయ దర్శనం

యోగఫలాలు అందించే అగస్త్యేశ్వరుడు

త్రికాలవేదిగా ఖ్యాతిగాంచిన అగస్త్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన త్రేతాయుగంలో ప్రతిష్ఠించినవిగా పేరుపొందిన అయిదు ఆలయాలు... పంచ అగస్త్యేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. అవి పూర్వ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాపేశ్వరం, ఆర్తమూరు, మండపేట, వల్లూరు, చెల్లూరులలో ఉన్నాయి. తాపేశ్వరంలో (ప్రస్తుత కోనసీమ జిల్లా) పశ్చిమాభిముఖంగా ఉన్న శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించినవారికి అద్భుతమైన యోగ ఫలితాలు లభిస్తాయని ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరదిశగా తుల్యభాగ నది ప్రవహిస్తున్నందున... దీన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.



వాతాపి జీర్ణం...

స్థల పురాణం ప్రకారం... త్రేతాయుగంలో వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వారు కామరూపులు. వాతాపిని ఇల్వలుడు గొర్రెగా మార్చి, ఆహారం వండి, తమ ఇంట పితృకార్యం పేరుతో బాటసారులకు భోజనాలు పెట్టేవాడు. వారు తిన్న తరువాత... "వాతాపీ బయటకు రా" అని ఇల్వలుడు పిలవగానే... భోజనాలు చేసినవారి ఉదరాలను చీల్చుకుంటూ వాతాపి వచ్చేవాడు. అలా మరణించినవారిని ఇల్వలుడు, వాతాపి రాక్షస రూపాల్లోకి మారి ఆరగించేవారు. ఈ విషయం తెలిసిన అగస్త్యుడు వారి వద్దకు వెళ్ళి, భోజనం చేసిన తరువాత "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు. అగస్త్యుడి ఉదరంలో కామరూపంలో ఉన్న వాతాపి పూర్తిగా జీర్ణమైపోయాడు. అందుకనే ఇప్పటికీ ఇళ్ళల్లో పిల్లలకు ఉగ్గు పట్టిన తరువాత పెద్దలు "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అంటారు. ఆ తరువాత ఇల్వలుణ్ణి కూడా తన తపశ్శక్తితో అగస్త్యుడు సంహరించాడు. వారిలో బ్రాహ్మణత్వం ఉండడం వల్ల అగస్త్యుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఆయన శివుణ్ణి ప్రార్థించి, స్వామి అనుగ్రహంతో ఇక్కడ శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ప్రతిష్ఠించడంతో... ఆయనకు చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకం నశించింది. ఈ ఊరి పేరు పూర్వం 'వాతాపిపురం' కాగా... కాలక్రమేణా తాపేశ్వరంగా మారింది.

> **ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.**

అత్యంత పురాతనం

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని, ఈ ఆవరణలో ఉన్న రెండు నాగమల్లి చెట్లకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉందని డెబ్బయ్యేళ్ళ నుంచి ఆలయ అర్చకుడిగా ఉన్న శంకరమంచి సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనమైన గిలకబావిలోని నీటినే స్వామి అభిషేకాల కోసం నేటికీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కొన్నేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని స్థానిక సురుచి ఫుడ్స్ యజమాని పోలిశెట్టి మల్లిబాబు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పునర్నిర్మించారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. కాకినాడ నుంచి రామచంద్రపురం మీదుగా, రాజమండ్రి నుంచి జొన్నాడ, ఆలమూరు, మండపేట మీదుగా తాపేశ్వరం చేరుకోవచ్చు.

• సి.ఎస్.మూర్తి
8328143489

సందేశం


కష్టాల్లో సహనం

"కష్టం వెనుక నిశ్చయంగా సుఖం ఉంటుంది. ఏ ఒక్కరి మీదా వారు భరించేగలిగేదానికన్నా ఎక్కువ భారాన్నీ, బాధ్యతను అల్లాహ్ మోపడు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో చెప్పారు. దానికి ఉదాహరణగా పేర్కొనే కథ ఇది. ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను ఊరి చివర్లో ఉండే పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం.

ఒక రోజు అతని ఉస్తాద్ (గురువు) పిల్లలకు పాఠం చెబుతూ... "తను సృష్టించిన ప్రతిదానిలో అల్లాహ్ ఒక హిక్మత్ (జ్ఞానం) ఉంచాడు. దాన్ని మనం కచ్చితంగా గమనించాలి" అని బోధించారు. ఈ మాటలు ఆ బాలుడి మనస్సులో బలంగా నాటుకుపోయాయి. ఆ రోజు సాయంత్రం తన ఇంటి దగ్గర ఉన్న తోటలోకి వెళ్ళాడు. అతనికి ఒక పట్టుపురుగు కనిపించింది. ఆ పురుగు తన చుట్టూ ఒక గూడు తయారు చేసుకుంటోంది. ఆ బాలుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఈ పురుగు ఇలా ఎందుకు చేస్తోంది? ఆ తరువాత దాని నుంచి బయటకు రావడానికి ఎందుకు అన్ని కష్టాలు పడుతోంది?' అని ఆలోచించాడు.

కొద్ది రోజులకు ఆ పురుగు పెద్దదయింది. రెక్కలు రావడం కోసం శ్రమ పడుతోంది. ఈ దశను గమనించిన ఆ బాలుడి హృదయం చలించిపోయింది. దానికి సాయం చెయ్యాలనుకున్నాడు. దాని చుట్టూ ఉన్న గూడును (కోకూన్) ఒక చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు. అప్పుడు ఆ పురుగు బయటకు వచ్చింది. కానీ రెక్కలు బలహీనంగా ఉండడంతో ఎగరలేకపోయింది. కొద్దిసేపటికే ప్రాణం కోల్పోయింది. ఆ బాలుడు తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాడు. మర్నాడు బడికి వెళ్ళి... తను చేసిన పనిని గురువుకు చెప్పాడు.

అప్పుడు ఆ గురువు "నాయనా! ఇలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ జ్ఞానాన్ని ఉంచాడు. ఆ పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడం ద్వారా దాని రెక్కలకు బలం వస్తుంది. నువ్వు చేసిన సాయం నీకు దయగా కనిపించవచ్చు. కానీ అది సాయం కాదు. అల్లాహ్ కొన్ని పరీక్షల ద్వారా మనల్ని బలోపేతం చేస్తాడు. ఆ సమయంలో మనం సహనం చూపిస్తే మనం బలంగా రూపుదిద్దుకుంటాం" అని వివరించారు. 'ప్రతి కష్టం మనకోసం అల్లాహ్ పెట్టే ఒక పరీక్ష, ఒక బహుమానం' అనే 'దివ్య ఖుర్‌ఆన్' వాక్యాలను చదివి వినిపించారు.



'కష్టాల్లో సహనం చూపించేవారికి అల్లాహ్ మేలు చేస్తాడు' అనే విషయం ఆ బాలుడికి అర్థమయింది. గురువుకు సలామ్ చేసి ఇంటికి బయలుదేరాడు.


• మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

భక్తే కాదు, విశ్వాసమూ ప్రధానమే

భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఇది ప్రతి భక్తుడూ కోరుకొనే విషయమే. కానీ ఇది అంత సులభమైనది కాదు. భగవంతుడి ఆశీస్సులు పొందాలంటే... ఆయనపై అనన్యమైన భక్తి, అపరిమితమైన విశ్వాసం ఉండాలి. అంతేకాదు, తమ కోరిక స్వార్థ ప్రయోజనాలకోసం కాకుండా... ప్రజాహితంగా, సమాజహితంగా ఉండాలనేది కూడా భక్తులు గ్రహించాలి. పరమేశ్వరుడి మీద మన నమ్మకం ఎంత కచ్చితంగా, ఎంత నిజాయితీగా ఉండాలో సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి ఒక కథలో వివరించారు.

దేవుడికి ప్రీతిపాత్రుడైన ఒక భక్తుడు ఆయనను దర్శించుకోవడానికి బయలుదేరాడు. దారిలో ఒక ముని ఎదురుపడ్డాడు. అతను దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు. "నేను భగవంతుణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను. నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పు. ఆయనకు తెలియజేస్తాను" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా... సంతోషం. నాకు తినడానికి ఇప్పటివరకూ ఆహారం రాలేదు. కాస్త తొందరగా ఏర్పాటు చేయమని భగవంతుడికి చెప్పండి" అన్నాడు ఆ ముని. అతను తనను ఎగతాళి చేస్తున్నాడనుకున్న ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. మరికొంత దూరంలో మరో ముని తారసపడ్డాడు. అతను తల్లక్రిందులుగా, ఎంతో క్లిష్టతరమైన తపస్సు చేస్తూ నానా తిప్పలూ పడుతున్నాడు. "నేను భగవంతుడి దగ్గరకు వెళ్తున్నాను. నీ గురించి ఏదైనా చెప్పమంటావా?" అని అడిగాడు భక్తుడు. "ఆయన దర్శనం కోసం నేను ఎంతో కాలంగా తపస్సు చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలో అడుగు" అన్నాడతను. 'సరే'నంటూ ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. భగవంతుణ్ణి కలుసుకున్నాడు. భగవంతుడు అతణ్ణి కుశల ప్రశ్నలు అడిగాడు. "ఇంకా ఏదైనా అడగాలా?" అన్నాడు. అప్పుడు ఆ భక్తుడు రెండో ముని సందేహాన్ని చెప్పాడు. "కంగారేమీ లేదు. అతను ఇంకా తపస్సు చేయాల్సిందే" అన్నాడు. ఆ తరువాత మొదటి ముని కోరిక గురించి చెప్పాడు. భగవంతుడు వెంటనే తన సేవకులను పిలిచి... ఆ ముని కోరుకున్న ఆహారాన్ని వెంటనే పంపించాలని ఆజ్ఞాపించాడు. "అదేమిటి స్వామీ! అంత కఠోర తపస్సు చేస్తున్న వ్యక్తిని ఇంకా కొంతకాలం వేచి ఉండాలంటున్నారు. తిండికోసం ఆరాటపడుతున్నవాడికి వరం ప్రసాదించారు. ఎందుకని?" అని అడిగాడు భక్తుడు. "సరేగానీ... ఆ మునులతో నేను భగవంతుణ్ణి కలిసే సమయానికి ఆయన సూది బెజ్జం నుంచి ఒంటెను బయటకు తీస్తున్నాడు" అని చెప్పు. అంతే! అప్పుడు నీకే అర్థమవుతుంది" అన్నాడు దేవుడు.



అది హృదయం లోతుల్లోంచీ రావాలి...

ఆయన దగ్గర సెలవు తీసుకున్న భక్తుడు అక్కడినుంచి బయలుదేరాడు. తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వచ్చాడు. "నువ్వు ఇంకా తపస్సు చేయాల్సి ఉందని దేవుడు చెప్పాడు. అయితే ఆయనను కలుసుకున్నప్పుడు... సూది బెజ్జంలోనుంచి ఒక ఒంటెను తీస్తూ ఉంటే కళ్ళారా చూసి ఆశ్చర్యపోయాను" అన్నాడు. అప్పుడు ఆ ముని "అది అసాధ్యమైన కార్యం. నువ్వు ఆయన దగ్గరకు వెళ్ళలేదు. కేవలం నన్ను నమ్మించడం కోసం ఇలా చెబుతున్నావు" అని కొట్టి పారేశాడు. ఆ తరువాత... తను మొదట కలుసుకున్న ముని దగ్గరకు భక్తుడు వెళ్ళాడు. అప్పటికే ఆ ముని... తనకు దేవుడు పంపిన ఆహారం తిని ఆనందంలో ఉన్నాడు. "భగవంతుడు సూది నుంచి ఒంటెను బయటకు తీయడం చూసి ఆశ్చర్యం కలిగింది. అలాంటి అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు" అని చెప్పాడు భక్తుడు. అందుకు ఆ ముని "ఇందులో అద్భుతం కానీ, ఆశ్చర్యపడాల్సినది కానీ ఏముంది? ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఒంటెను ఏమిటి? సూది బెజ్జంలోంచి విశ్వాలన్నిటినీ తీయగల సమర్థుడు" అని చాలా ధీమాగా చెప్పాడు. భక్తి శ్రద్ధలు మాత్రమే కాదు, భగవంతుడి మీద అచంచలమైన విశ్వాసం తప్పనిసరిగా ఉండాలని చెప్పే అనేక ఉదాహరణలు మన పురాణ గ్రంథాలలో ఉన్నాయి. పైన చెప్పిన కథలో మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే... భగవంతుడి శక్తి మీద భక్తుడికి ప్రగాఢ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హృదయం లోతుల్లోంచీ రావాలి. ఆత్మ ద్వారా వ్యక్తం కావాలి.

అన్నీ సాధ్యమే...

కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందిన సహజ యోగులకు... వారి ఆత్మ విశ్వాసం ద్వారా ఇది సులభసాధ్యం అవుతుంది. అప్పుడు అది అంధ విశ్వాసం కాదు. ఆత్మ వికాసంతో సాధించుకున్న విశ్వాసం. మనలో నిగూఢంగా, నిద్రాణ స్థితిలో ఉన్న దివ్యశక్తి అయిన కుండలినీ శక్తి... ఒక సద్గురువు సమక్షంలో జాగృతి చెందాలి. ఆత్మసాక్షాత్కారాన్ని అనుభూతిపరంగా మనం స్వయంగా గ్రహించాలి. భగవంతుడి ప్రేమను, అనుగ్రహాన్ని తక్కువగా అంచనా వేసుకోలేం కదా! మరి ఆత్మ సాక్షాత్కారాన్ని ఆయన సునాయాసంగా ప్రసాదిస్తాడనే విషయంలో సందేహం ఎందుకు? అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయనను ప్రశ్నించడానికి, అంచనా వేయడానికి మనమెవరం? మనకు ఉండవలసినది ఆయన మీద, ఆయన శక్తి మీద తిరుగులేని విశ్వాసం మాత్రమే. దాని ద్వారా అన్నీ సాధ్యమేనని నమ్మాలి.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



దైవమార్గం

అత్తాకోడళ్ల కథ

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్థులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం,

> **అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.**



వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

జెన్ కథ

మూర్ఖ శిఖామణి

జపాన్‌లో ఒక గొప్ప జెన్ గురువు ఉండేవాడు. అతని పేరు ర్యోకాన్. అందరూ 'మూర్ఖ శిఖామణి' అని పిలిచేవారు. ర్యోకాన్ వింత ప్రవర్తనే దానికి కారణం. కానీ అతను సామాన్యమైన గురువు కాదు. ఎందరికో అతీంద్రియానుభవాన్ని కలిగేలా చేసిన మహనీయుడు. ర్యోకాన్ చాలా చిన్న వయసులోనే ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కోషోజీ ఆలయంలో ఏకాంతంగా గడిపేవాడు.

ఒక రోజు కోకుసెన్ అనే గురువు ఆ ఆలయానికి వచ్చాడు. ఆయనలో ఏదో శక్తి ర్యోకాన్‌ను ఆకర్షించింది. ఆయనకు ఇతను శిష్యుడయ్యాడు. ఆయన వెంట ఎట్సుంజీ మఠానికి వెళ్ళి... అక్కడ ధ్యానంలో గడిపేవాడు. కొన్నేళ్ళకు కోకుసెన్ మరణించాడు. ఆలయంలో పూజారిగా ఉండడం ర్యోకాన్‌కు ఎప్పుడూ ఇష్టం లేదు. కాబట్టి తనకు నచ్చిన విధంగా, నచ్చిన చోట ఉండాలని నిర్ణయించుకొని... తీర్థయాత్రలు చేశాడు. కవితలు రాస్తూ, పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపేవాడు. జెన్ సన్యాసులు సాధారణంగా మాంసం తినేవారు కాదు. కానీ ఎవరైనా చేపలను వడ్డిస్తే ర్యోకాన్ హాయిగా తినేవాడు. "నేను చేపలను తింటాను. ఈగలకు, దోమలకు నా దేహాన్ని విందు భోజనం కింద ఆనందంగా సమర్పిస్తాను" అంటూ ఉండేవాడు. పండుగల్లో మహిళలు మాత్రమే పాల్గొనే కార్యక్రమాలు కొన్ని ఉండేవి. ర్యోకాన్ స్త్రీ వేషధారణలో వెళ్ళి ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.



అతని కుటీరానికి ఒక రోజు రాత్రి ఒక దొంగ వచ్చాడు. ఏదీ దొరక్క, అతను వెళ్ళి పోతూ ఉంటే... రోకాన్ అతన్ని ఆపాడు. "ఉత్త చేతులతో నా ఇంటి అతిథి వెళ్ళరాదు. ఇదిగో! నా వస్త్రాన్ని తీసుకువెళ్ళు" అంటూ తాను కట్టుకున్న వస్త్రాన్ని అతనికి ఇచ్చేశాడు. దిగంబరంగా కూర్చొని ఆకాశంలో చంద్రుణ్ణి చూస్తూ పరవశించిపోయాడు. ఎప్పుడూ ఏకాంతంగా నడుస్తూ, హృదయం నుంచి పొంగి పొరలే కవితల్ని వర్షిస్తూ హాయిగా గడిపే ర్యోకాన్‌కు శిష్యులంటూ ఎవరూ ఉండేవారు కాదు. కానీ ఎందరో ఆయననుంచి ప్రేరణ పొంది ధ్యానం చేసేవారు. ధ్యానంలో అత్యున్నత శిఖరాలను అందుకొనేవారు. ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమైన ర్యోకాన్ లౌకిక విషయాలను ఎలాంటి క్రమం లేకుండా అనుసరించేవాడు. చెప్పులను తలమీద పెట్టుకొనేవాడు. వస్త్రం లేకుండా వీధుల్లో నడిచేవాడు. తలపైన ఉండవలసిన టోపీని కాలికి తగిలించుకొనేవాడు. తనలోతాను నవ్వుకొనేవాడు. ఇదంతా గమనించిన ప్రజలు అతణ్ణి 'మూర్ఖ శిఖామణి' అంటూ వ్యవహరించేవారు. ఒక గ్రామంలో ర్యోకాన్‌ని దొంగగా భావించిన ప్రజలు అతణ్ణి సజీవంగా పాతి పెట్టారు. ర్యోకాన్‌తో పరిచయం ఉన్న టైషన్ అనే సన్యాసిని ఈ వివరాలను లోకానికి వెల్లడిస్తూ... ఆయనను జ్ఞాన శిఖామణిగా కీర్తించింది.

• రాచమడుగు శ్రీనివాసులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణాల వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇళ్లు మంజూరీ అయిన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిర్మాణం జరిగిన వాటికి దశల వారీగా బిల్లులు మంజూరీ చేయాలన్నారు. మండలాల ప్రత్యేకాధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ దశలను తనిఖీ చేయాలని అవసరం ఉన్న చోట తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ అయి స్వయం సహాయక బృందాల్లో ఉన్న మహిళలకు వడ్డీలేని రుణాల ద్వారా ఇంటి నిర్మాణానికి సహకరించాలని చెప్పారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జడ్పీ సీఈవో పురుషోత్తం, హౌసింగ్ పీడీ రాజయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వెంకటయ్య

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం మొక్కను అందించారు. ఇటీవల నూతనంగా జిల్లా పోక్సో కోర్టు పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్‌ను కలిసినట్లు వెంకటయ్య ఈ సందర్భంగా తెలిపారు.

23న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో ఈనెల 23న జరుపతలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనగిరి మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బట్టు అంజయ్యస్మారక భవనంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కనీసం విద్యాశాఖ మంత్రిని ఇకూడ నియమించలేదని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవెలబుల్ స్కీం నిధులఃను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో గుండ్ల రాకేష్, మహేష్, సుశ్మాంత్, విజయ్, వీరేందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మహబూబాబాద్‌లో మోడల్ మార్కెట్‌ను సందర్శిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పార్టీల కతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం 115 మంది రూ. 36.65 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తూ ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని చెప్పారు.

మోడల్ మార్కెట్‌ను సందర్శన..

మహబూబాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే మురళీనాయక్ పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. మునిసిపల్ డీఈ ఉపేందర్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఖలీల్‌పాషా, గుగులోతు దస్రూనాయక్, పద్మం ప్రవీణ్, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, ఎడ్ల రమేష్, పోతురాజు రాజు, అజ్మీర సురేష్‌నాయక్, సల్వాది దిలీప్, గాదె శ్యాంరావు, బొల్లు రాజు, రాంచంద్రు పాల్గొన్నారు.

సీరోలు ఎస్సై నగేష్ బదిలీ

కురవి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సీరోలు ఎస్సై నగేష్ గురువారం బదిలీ అయ్యారు. ఉన్నతాధికారుల ఉత్తర్వులతో నగేష్ హైదరాబాద్ నార్కోటిక్ విభాగానికి బదిలీపై వెళ్లారు. గత సంవత్సర కాలంగా సీరోలు ఎస్సైగా నగేష్ బాధ్యతలు నిర్వహించారు. బదిలీపై వెళ్లిన నగేష్ స్థానంలో ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు.

భరత్ సంస్మరణ సభను విజయవంతం చేయండి

కొత్తగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఎంచగూడెంలో బంధుమిత్రుల ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించతల పెట్టిన భరత్ 25వ సంస్మరణ సభను విజయవంతం చేయాలని బంధుమిత్రులు జిట్ట బోయిన యాకయ్య, బండి పెద్దకుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంచగూడెం గ్రామానికి చెందిన బండి అల్లోరు చిన్న వయసులోనే విప్లవోద్యమంలో చేరి దేవన్నగా, భరత్‌గా, జార్జీగా అంకిత భావంతో కార్యకర్త నుంచి ఉత్తర తెలంగాణ దళకమాండర్‌గా పార్టీ నిర్మాణానికి నిజాయితీగా పనిచేశాడని పేర్కొన్నారు. 2000 సంవత్సరం జూలై 19న అమరుడయ్యారని పేర్కొన్నారు. సంస్మరణ సభకు పూర్వ మిత్రులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

‘గడ్డి మందు పిచికారి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి’

మహబూబాబాద్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌మండలం బ్రాహ్మణపల్లి లక్ష్మీపురం నర్సరీ మొక్కలపై గడ్డి మందు పిచికారి చేస్తున్న వరిపెల్లి సురేష్, జానిమియా, సైదులుపై చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి కుమార్ అన్నారు. పంచాయతీ కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాల క్రితం అప్పటి కలెక్టర్ గౌతమ్‌కుమార్ ప్రభుత్వ స్థలాన్ని హరితవనం, పల్లె ప్రకృతి వనానికి కేటాయించినట్లు చెప్పారు. అప్పట్నుంచి అందులో హరితవనం కోసం మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు చెప్పారు. మొక్కలపై గడ్డిమందు పిచికారిచేసిన ముగ్గురిపై మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ నెల 1న హరితవనంలో వరిపెల్లి సురేష్ ట్రాక్టర్‌తో దున్నడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి కేసు నమోదు చేశారు.

మరల గురువారం హరితవనంలో నాటి మొక్కలపై సురేష్‌తో పాటు జానిమియా, సైదులు కలిసి గడ్డిమందును పిచికారిచేశారని చెప్పారు.

యతిరాజారావు ఆశయ సాధనకు కృషి చేయాలి

పెద్దవంగర, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : యతిరాజారావు ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్, మాజీ సర్పంచ్ నెమురుగొమ్ముల ప్రవీణ్‌రావు, నెమురుగొమ్ముల ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వడ్డెకొత్తపల్లిలో ఉమ్మడి రాష్ట్ర మాజీ దేవదాయశాఖ మంత్రి నెమురుగొమ్ముల యతిరాజారావు 95వ జయింతి సందర్భంగా గ్రామస్థులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్తినేని శ్రీనివాస్, తంగెళ్లపల్లి మల్లికార్జునచారి, చిలసాని మల్లేష్, రమేష్, వెంకన్న, ఎల్లయ్య, మాధవి, జనార్ధన్, యాకన్న, కొమరమల్లు, సైదులు, వెంకటేశ్వర్లు, కిరణ్, సుధాకర్, బీరన్న, సంపత్‌కుమార్, మధు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వంటకు నీళ్లు కరువు

● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, నిర్వాహకులు

గార్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అంకన్నగూడెం పాఠశాలలో గత ఆరు నెలలుగా తాగునీటిని అందించే బోరింగ్ పాడైపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వంట నిర్వహకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. ప్రతీరోజు పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వడ్డన చేయాలంటే నీళ్లలేక భోజన నిర్వహకులు మైళ్ల దూరం పోయి వ్యవసాయ బావుల నుంచి నీళ్లు తీసుకవచ్చి వంటలు చేయడం జరుగుతుందని నిర్వహకులు చెబుతున్నారు. పాఠశాలలో తాగు నీరులేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతూ చదువులను కొనసాగిస్తున్నారు. బోరింగు మరమ్మతుల కోసం అనేక సార్లు కార్యదర్శి, ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. ఇలాగైతే మధ్యాహ్న భోజన వడ్డన చేయలేమని, మేము వేరే వ్యవసాయ పనులు చూసుకుంటామని నిర్వాహకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

పేదల కోసం పోరాడిన జగన్నాథం

● సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్


జగన్నాథం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మహబూబాబాద్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తన గొంతుల ప్రాణమున్నంత వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన ప్రజా నాయకుడు పెరుమాండ్ల జగన్నాథం అని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో దివంగత పెరుమాండ్ల జగన్నాథం వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ....అనేక ప్రజా పోరాటాలు నిర్వహించి సీపీఎం బలోపేతానికి కృషి చేసిన మహానాయకుడు జగన్నాథం అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, గునిగంటి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు


డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై ఉపేందర్

తొర్రూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై ఉపేందర్ అన్నారు. గురువారం తొర్రూరులోని వివిధ సెంటర్‌లలో సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ఇతర అనుమతి పత్రాల తనిఖీలు నిర్వహించి ఆయన మాట్లాడారు. వాహనదారులు తప్పనిసరిగా ఆర్‌సీ, ఇన్సూరెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు మైనర్‌లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దన్నారు. వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై పీడీ యాక్టులు నమోదు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ లేకున్నా కేసులు నమోదు చేస్తామన్నారు. అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో సిబ్బంది తదితరులు ఉన్నారు.

వరిలో వెదజల్లే పద్ధతిని అవలంభించాలి

గార్ల ఏవో కావటి రామారావు

గార్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ఖర్చుతో వరిలో ఎక్కువ లాభాలు వచ్చే వెదజల్లే పద్ధతిని రైతులు అలవర్చుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కావటి రామారావు సూచించారు. గురువారం పెద్ద కృష్టాపురంలో వరిలో వెదజల్లిన పంట పొలంలో క్షేత్ర సందర్శన జరిపి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వెదజల్లు పద్ధతిలో సకాలంలో కలుపు నివారణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధ్యమవుతుందన్నారు. విత్తనాలు చల్లిన రెండు రోజులోపు ఎకరాకు లీటర్ పెండి మెథాలిన్ పిచికారి చేయాలన్నారు. వరిమొక్క 20 నుంచి 25 రోజుల సమయంలో ఎకరాకు 100 మిల్లీగ్రాములు నామినిగోల్డ్‌కాని, 90 గ్రాముల కౌన్సిల్ యాక్టివ్‌కాని, 600 మిల్లీ గ్రాముల వివాయ అనే మందును పిచికారి చేయాలని రామారావు పేర్కోన్నారు. దమ్ములో బస్తా డీఏపీ, 3బస్తాల సూపర్ గానీ, 20 కేజీల యూరియా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు గంగవత్ లక్ష్మణ్ నాయక్, పాల్గొన్నారు.


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యుడు స్వామికుమార్

ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి

మరిపెడ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల తగిన ప్రజలు జాగ్రత్తలు వహించాలని పీహెచ్‌సీ వైద్యుడు స్వామి కుమార్ అన్నారు. గురువారం గుండెపుడిలో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. ఈ వైద్య శిబిరంలో హెచ్ఈవో కృష్ణ, సూపర్‌వైజర్ లక్ష్మీకుమారి, ఏఎన్ఎంలు లలిత, హరీశ్, జన వికాస సంస్థ సెంటర్ మేనేజర్ గందశిరి ఉపేంద్ర, జె.ఉపేంద్ర, ఆశా వర్కర్లు విజయలక్ష్మి, ఇంద్రజ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలి

తొర్రూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీజీ హెడ్‌మాస్టర్, స్కూల్ అసిస్టెంట్‌ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు ఇవ్వాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి బీఈడీ, డీఈడీ అర్హతలు ఉన్న ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీని అమలు చేయాలని, 317 జీవోతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. తదితర సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామన్నారు.

ఆలయంలో భక్తులకు అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న సాయిబాబా ఆలయ నిర్వాహకులు

మరిపెడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ సాయిబాబా ఆలయ నిర్వాహకులు భక్తులకు గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఆలయ అర్చకుడు రవీంద్రాచారి సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. సాయిబాబాకు భక్తులు పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంపటి లక్ష్మీనారాయణ, బోనగిరి సత్యనారాయణ, గర్రెపల్లి జానకీరాములు, రాంబాబుపాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఇనుగుర్తి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండల కేంద్రంలో ఇటీవలే మృతి చెందిన ఎండీ.నబీసాహెబ్ కుటుంబానికి గురువారం శ్రీలక్ష్మీనర్సింహా కార్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మలిశెట్టి శోభన్, బండి సంతోష్, ఎండి.రహీం, జాటోత్ హరిచంద్, సలీం, రంజిత్, హరికృష్ణ, ప్రవీణ్, అశోక్ పాల్గొన్నారు.

చింతలపల్లిలో దొంగతనం

తొర్రూరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. చింతలపల్లి గ్రామానికి చెందిన యాసారపు రామచంద్రయ్యగౌడ్-నాగలక్ష్మి దంపతులు దంతాపల్లి మండలం పెద్దముప్పారంలో ఉంటున్న తన కూతురు సత్తెమ్మ వద్దకు మూడు రోజుల కిందట వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.70వేలు అపహరించుకుపోయారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీం సహకారంతో వివరాలు సేకరించారు.

రైతులకు తప్పక రశీదులు ఇవ్వాలి


ఫర్టిలైజర్ షాపులో రికార్డును పరిశీలిస్తోన్న ఏడీఏ

దంతాలపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ షాపు యజమానులు తప్పక రైతులు కొనుగోలు చేసే మందులకు రశీదులు ఇవ్వాలని మరిపెడ ఏడీఏ విజయచంద్ర అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో రైతులు ఇష్టానుసారంగా మందులను పిచికారి చేస్తే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులు సమీప సంబంధిత అధికారులు, ఏఈవోలను సంప్రదించి మందులను పంటలపై పిచికారి చేయాలన్నారు. ఏవో వాహిని, ఏఈవోలు శిరీష, దీక్షిత్‌కుమార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా

దంతాలపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట మండల కేంద్రంలోని అనుమతిలేని ప్రైవేటు పాఠశాల గుర్తింపును రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా చైర్మన్ పంతం విజేందర్ మాట్లాడుతూ పలుమార్లు ఎంఈవో, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

12 గంటలు దాటినా రాని చిన్నారులు

● అంగన్‌వాడీ సెంటర్‌లోనే టీచర్

తొర్రూరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపిరాల గ్రామ శివారులోని పెద్దదుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలు లేకుండా టీచర్ ఒక్కరే ఉన్న సంఘటన గురువారం వెలుగు చూసింది. తండావాసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామ పంచాయతీ భవనం వద్దనే అంగన్‌వాడీ సెంటర్ ఉండడంతో పక్కన ఉన్న తండా నుంచి 5గురు పిల్లలు వస్తుంటారు. చిన్నారులను ఉదయం సెంటర్‌కు తీసుకువచ్చి బాలామృతం, భోజనం అందించాల్సి ఉన్నప్పటికీ గురువారం మధ్యాహ్నం 12గంటల వరకు కూడా ఒక్క చిన్నారి కూడా సెంటర్ రాకపోగా టీచర్ అంజలిదేవి అక్కడే కూర్చోని కాలక్షేపం చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించగా ఆయా ఆలస్యంగా వస్తుందని, ఆమె వచ్చిన తరువాత తీసుకువస్తుందని చెప్పారు. ఈ విషయంపై సీడీపీవో కమలాదేవిని వివరణ కోరగా ఆయా అందుబాటులో లేకపోతే టీచర్ బాధ్యతగా పిల్లలను తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. పిల్లలను సెంటర్‌కు తీసుకురాకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయాకు మెమో జారీ చేస్తున్నట్లు తెలిపారు. విధుల పట్ల ఎవ్వరూ నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో రెడ్ కలర్స్ డే

తొర్రూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం రెడ్ కలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, బాలామృతం, లబ్ధిదారులకు సకాలంలో అందించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు చేపడుతుందని, ప్రతీ శనివారం కేంద్రాల్లో ఎగ్ బిర్యానీతో పాటు ప్రతీ రోజు పాలు, గుడ్లు, పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. పిల్లలను, బాలింతలను ఉత్తేజ పరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, టీచర్లు శైలజ, సుకన్య, ప్రమీల, లక్ష్మి, జ్యోతి తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

● టౌన్ సీఐ మహేందర్ రెడ్డి

మహబూబాబాద్ క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు కాలనీ పోలీసు అధికారులు (సీపీవో) కృషి చేయాలని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. గురువారం టౌన్ పోలీసు స్టేషన్‌లోని కాలనీల ఇన్‌చార్జీల నియామకపత్రాలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీపీవోలు విధుల్లో భాగంగా వారికి కేటాయించిన ప్రతీ కాలనీ సమాచారం సేకరించడం, కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం, శాంతిభద్రతలు విఘాతం కలిగించే వారిపై నిఘా పెంచాలన్నారు. విధి నిర్వాహణలో నిర్లక్ష్యం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శివ, అరుణ్‌కుమార్, అలీ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కోమటిపల్లిలో వనమహోత్సవం


మొక్కను నాటుతున్న డివిజనల్ మేనేజర్ మాధవి

ఇనుగుర్తి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆ సంస్థ ములుగు డివిజనల్ మేనేజర్ ఎం.మాధవి, ఇన్‌చార్జ్ ప్లాంటేషన్ మేనేజర్ డి.రాకేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, మాజీ సర్పంచ్ నీలం యాకయ్య, హెచ్ఎం కోటేశ్వర్ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో యువకుడి మృతి

● వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదం

● భూపాలపల్లి జిల్లాలో ఘటన

మల్హర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుతో యువకుడు మృతి చెందిన ఘటన భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మల్లారం గ్రామానికి చెందిన కలువల నాగరాజు (21) ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిప్లొమా చేశాడు. చదువు పూర్తి కావడంతో ఇంటి వద్దే ఉంటూ తండ్రి మొగిళితో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు. ఎప్పటిలాగే మానేరులోని బోరు మోటారు వద్ద తండ్రీకొడుకులు వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగుపడి నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు.

మొగిళికి ఇద్దరు కొడుకులు. పెద్ద కుమారుడికి పెళ్లికాగా చిన్న కుమారుడు నాగరాజు అవివాహితుడు. చేతికందిన కొడుకు పిడుగుపాటుకు గురై మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

దోమల నివారణ చర్యలు చేపట్టాలని వినతి

కేసముద్రం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం పురపాలక కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు మంద భాస్కర్ మాట్లాడుతూ సీజన్ మారడంతో వర్షాలకు దోమలు వ్యాప్తి చెందుతూ ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని అన్నారు. వెంటనే ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ తదితర దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట జన్ను రాజేందర్, సందీప్ ఉన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

గార్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అంకన్నగూడెం గ్రామానికి చెందిన వట్టం కొండల్‌రావుకు ఇటీవల ఇల్లెందు సమీపంలో ద్విచక్ర వాహన ప్రమాదంతో తీవ్ర గాయాలపాలై కోమాలోకి పోవడం జరిగింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండటంతో మండల కేంద్రంలో గణేష్ యువసేన, రామదండు 108 సభ్యులు స్పందించి రోగి చికిత్స కోసం రూ. 5వేలు ఆర్థిక సహాయం కుటుంబసభ్యులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమల్‌కుమార్ అగ్రవాల్, కొదుమూరి రాకేష్, కుసుకుంట్ల ఉపేందర్ రెడ్డి, తాళ్లపల్లి రోహిత్‌గౌడ్, కట్టా రమేష్, హరీష్, వంశీ పాల్గొన్నారు.